# బంగారు వడ్డీ

రైలు కూత శబ్దానికి మెలకువ వచ్చి చుట్టూ చూసాడు అంజయ్య. తెల్లవారు తుందనడానికి గుర్తుగా పిట్టలు కిచకిచమంటున్నాయి. కప్పుకున్న దుప్పటిని పక్కకునెట్టి లేచి కూర్చున్నాడు. దడదడ శబ్దం చేస్తూ రైలు వెళ్ళిపోయింది. చీకటి ఇంకా విడిపోలేదు. వేప చెట్టుమీద గూళ్ళల్లో ఉన్న పిచ్చుకలు తిరుగడానికి ఆయత్తమౌతూ వెలుతురు వైపు దృష్టినిసారిస్తున్నాడు.

వేసవికాలం కావడం వల్ల వాకిట్లో వేప చెట్టుక్రింద నులకమంచం వేసుకుని పడుకున్నాడు. అంజయ్య. అతడి భార్య ఇద్దరు పిల్లలు ఇంట్లోనే పడుకున్నారు. ఫ్యానుగాలిలేనిదే వారికి నిద్రపట్టదు. అంజయ్యకు ఫ్యానుగాలి అంటే గిట్టదు. చల్లగా వీచే వేప చెట్టుగాలి ముందు అదిఏపాటిది అంటాడు.

కండ్లు నులుముకుంటూ పెరట్లో ఉన్న బర్రె పాకలోకి నడిచాడు అంజయ్య. అతడిని చూడగానే దూడపాలకొరకు గింజుకోవడం మొదలెట్టింది. చెవులను టపటప లాడిస్తూ బర్రె లేచి నిలబడింది. గుడిసె మీద మోపుకట్టి ఉంచిన ఎండుగడ్డిని తీసి బర్రెముందేసాడు. అది అవురావురు మంటూ గడ్డి మేస్తుంటే దానిని ప్రేమగా నిమిరాడు అంజయ్య.

అంతకు ముందేలేచి వాకిలి ఊడుస్తున్న బాలవ్వ భర్తవైపు ఒకసారి విచిత్రంగా చూసి తనపనిలో నిమగ్నమై పోతూ అన్నది.

"బర్రెను ఇయ్యాల్ల కొత్తగ కొన్నట్టు సూత్తున్నవేందీ....? ఇంకా పాలు పిండవా...?పాలవాడు కలోల్లు వత్తరు. మేరోల్ల పెద్దవ్వ మబ్బుల బస్సుకు పోతదట. చాయ చేసుకుని తాగిపోతనన్నది జెట్టన పాలు పిండు."

భార్య వైపు చూసి విరక్తిగా నవ్వుతూ అన్నాడు అంజయ్య.

"ఇంకెన్ని రోజులు తియ్యి. వారం పది రోజులైతే మనం కూడా ఎవల దగ్గరనన్న వాడిక పెట్టుకోవాలె. బర్రెను అమ్ముతున్న. ఎడ్లను గూడా అమ్ముతున్న. బొంబాయినుండి నిన్న ఫోను వచ్చిందంట. ఏజెంట్ శీను వచ్చి నాతో చెప్పిండు. విజాలువత్తున్నయట. వారం రోజుల్లో పైసలు తయారు చేసుకోమ్మన్నడు. మెడికల్ జేపిచ్చి మస్కట్ ఎక్కిచ్చుడేనట. విజా వచ్చినంక రెండు రోజులకంటే ఎక్కువ టైం ఉండదట."

చేస్తున్న పని ఆపి భర్త వైపు కోపంగా చూసింది బాలవ్వ. ఆమె నుదురు ముడిపడింది. "ఇది పని ఉన్న దినం. మల్ల గా ఏశం ఎయ్యకు. ఎవ్వల దన్న రెండెకురాలు కౌలుకు దొరుకుగద మంచిగుండు అన్నవు. ఇప్పుడు దొరికినంక ఎడ్లమ్ముత, బర్రెనమ్ముత, గొర్రెనమ్ముతనంటున్నవు" గొణుక్కుంటూ తనపనిలో మునిగి పోయింది బాలవ్వ.

అంజయ్య ఏజెంట్ దగ్గర పాస్‌పోర్ట్ పెట్టి సంవత్సరం దాటింది. పాస్‌పోర్ట్‌తో పాటు పదివేలు ఇస్తే నెలరోజుల్లో మస్కట్ ఎక్కిస్తనన్నడు శీను. అప్పటికప్పుడు ఫైనాన్స్‌లో అప్పు తీసుకువచ్చి ఇచ్చాడు అంజయ్య. ఆనాటినుండి శీను ఇవేమాటలు చెబుతున్నాడు. వారం రోజుల్లో విజా నిజంగానే వస్తుందని అంజయ్య నమ్ముతూనే ఉన్నాడు.

మొదట్లో శీను వారం పదిరోజుల్లో విజా వస్తుందని చెప్పినప్పుడు అంజయ్యకు సంతోషంగానూ, కాస్తంత దిగులుగాను ఉండేది. ఆతృత కలిగేది. ఆ విషయం బాలవ్వతో చెప్పేవాడు. ఇక తమ కష్టాలు తీరిపోయాయని ఆమె సంతోషపడేది. భర్తదూర దేశం వెళ్తున్నాడని బొమ్మెచేపలు, కోడిమాంసం, మేకమాంసం వండేది. ఒక్క చెట్టుది ఈతకల్లు తెప్పించేది.

రెండుమూడు సార్లు ఇలాగే జరిగాక ఏజెంట్ శీను మాటల్ని నమ్మలేకపోయింది బాలవ్వ. ఒకసారైతే విజా వచ్చిందని బొంబాయికి తీసుకుపోయాడు. బంధుమిత్రులందరూ అంజయ్యను సాగనంపారు. వారం తిరగకముందే ఇల్లు చేరుకున్నాడు అంజయ్య. ఏదో కారణం చెప్పి మళ్ళీ నెలరోజులు వాయిదా వేసాడు శీను. ఆనాటినుండి ఇద్దరికీ నమ్మకం పోయింది.

"ఏంటిదే గట్ల మాట్లాడుతున్నవు నేను మస్కట్ పోవుడు ఇష్టం లేకపోతే చెప్పు. రాకరాక విజా వస్తే గట్లమాట్లాడుతవు." నవ్వుతూ అన్నాడు అంజయ్య.

అప్పటికే వాకిలి ఊడ్వడం పూర్తి చేసింది బాలవ్వ. అంజయ్యవద్దకువచ్చి మరింత కోపంగా అన్నది "పోతనన్ననాడు పోతే సగం పాతవడుదువు. ఏం పోకడ పాడైంది. నీ పోకట్ల మన్నువడ ఎవలన్నవింటె ఎక్కిరిత్తరు. మస్కట్ పోతడట మస్కట్. అప్పుడు అడ్డగోలుమిత్తికి దెచ్చివాని బొంద మీద పదివేలు పెట్టుడాయె. గా పైసలున్నాగానీ లాగోడిఎల్లుతుండే"

"గట్లగాదే....ఈసారి నాకెందుకో నిజంగనే విజా వత్తదనిపిస్తంది. శీను ఒట్టుపెట్టుకుని మరీ చెప్పాడు. వారం పది రోజుల్లో విజా రాకపోతే పదివేలకు ఇరవైవేలు ఇస్తనంటుండు. ఎప్పుడైనా నసుక్కుంట మాట్లాడేటోడు ఈసారి గట్టిగ మాట్లాడిండు." భార్యను సముదాయిస్తున్నట్టుగా అన్నాడు అంజయ్య.

క్షణం సేపు నివ్వెరపోయి చూసింది బాలవ్వ. ఇంతవరకు భర్త నవ్వులాటకు అంటున్నా డేమోననుకుంది. అది నవ్వులాట కాదని తెలిసాక శీనును ఎలా నమ్ముతున్నాడో అర్థం కాలేదు. ఇన్నిసార్లు మోసపోయినా ఈయనకు బుద్ధిరాలేదేందీ అనుకుంది. ఒక్కక్షణం ఆమె గుండె దడదడ లాడింది. అసలే అది వరినాట్లు వేసేదినం. అందుకే గట్టిగానే మందలించాలనుకుంది.

"నువ్వు నాకు చెప్పకనన్నఊకో. వంగలేని తనం ఎత్తుకున్నవు. మీద మీద తిరుగ మరిగి పని ఒత్తిడి ఉన్నప్పుడల్లా గివే మాటలంటున్నవు. యాసంగి దున్నుకాలమీద పోతపోతనని పాలం పాలుకు ఇచ్చి చేతులు ముంగటపెట్టుకుని కూసుంటివి. అంతకు ముందు కోతల మీద రెండు మూడు రోజుల్లో పోతనని అడ్డగోలు కైకిల్లు పెడితివి. ఇప్పుడు దున్నుకాలు పట్టెముందు మల్లగిదే పాట పాడుతున్నవు. నీపోవుడు వాగులవోను. పోవుడద్దుమన్నద్దు. మస్కట్ మస్కట్ అని సంసారాన్ని తెర్లు జేత్తివి."

ఆ మాటలకు అంజయ్య మౌనంగా ఇంట్లోకివెళ్ళాడు. బాలవ్వ వాకిట్లో కల్లాపి జల్లే పనిలో మునిగిపోయింది. ఇత్తడి సర్వ తెచ్చి పాలు పిండి ఇంట్లో పెట్టాడు. కుడిదిలో తవుడు ఉప్పు కలిపి గోరు వెచ్చగ చేసి బఱ్ఱె ముందుంచాడు. వేపపుల్లను నములుతూ పేడ తీసి పాకను శుభ్రం చేసాడు.

పనిచేస్తూనే ఆలోచిస్తున్నాడు అంజయ్య. శీను మాటలు నమ్మాలనిపిస్తుంది. గత అనుభవాలు చూస్తుంటే నమ్మకూడదనిపిస్తుంది. వారం పది రోజుల్లో విజా తప్పకుండా వస్తుందని చెప్పాడు. తర్వాత రెండు రోజుల్లో బొంబాయికి వెళ్ళి పోవాలని చెప్పాడు. ఆఫీసులో కట్టే డబ్బును ఇప్పుడే తయారు చేసుకొమ్మని మరీ మరీ చెప్పాడు. విజా కొరకు అరవై వేలు కట్టాలి. ఇప్పటి నుండి తిరిగితే తప్ప అప్పు పుట్టదు. విజా వచ్చినాకనే అప్పు అడుగుదామంటే అప్పటికప్పుడు ఎవరిస్తారు...? అప్పుఅడగాలా వద్దా....?

అప్పు పుట్టాక విజా రాకపోతే మిత్తి మీద పడుతుంది. విజా వచ్చినంకనే అప్పు అడుగుదామంటే అప్పటికప్పుడు ఇంత పెద్దమొత్తంలో డబ్బు దొరకదు...ఎలా...?

అంజయ్య ఎటూ ఆలోచించుకోలేని, పరిస్థితుల్లో ఊగిసలాడుతుండగానే శీను మళ్ళీ కలిసి చెప్పాడు. "అంజన్న...గిన్నిరోజులు విజా విజా అని నా పాణం తిన్నవు. నేను ముందే చెబుతున్న పైసలు రెడీ చేసుకో. విజా వచ్చినంక రెండే రోజుల చాన్సు ఉంటది. గప్పుడు పైసలు కాలేదంటే నీ పదివేలు రావు పాస్‌పోర్ట్‌రాదు. నన్ను మాత్రం బదునాము చెయ్యద్దు."

ఆ మాటలతో అంజయ్యకు పూర్తి నమ్మకం కుదిరిపోయింది. ఒకటి రెండు సార్లు దబాయించి అడిగినా అతడు అలాగే చెప్పాడు. ఆ రోజు రాత్రి భార్యతో ఈ విషయం చెప్పాడు అంజయ్య. అతడిని వెర్రివాడిని చూసినట్టుగా చూసింది బాలవ్వ. మరోసారి ఆమెకు భయం పట్టుకుంది. దున్నుకాలు విడిచిపెట్టి ఎక్కడ బొంబాయి వెళ్ళిపోతాడోనని కంగారు పడింది. వెంటనే మంద లించింది.

"నువ్వు ఎవ్వలు ఏది చెప్పితేగదే నమ్ముతవు. విజా లేదు గిజాలేదు. కాలం మంచిగయింది. రెండెకరాలు కౌలుకు పట్టుకుంటిమి. ఇంత ఇంటిచేనుండె మంచిగ ఎవుసం జేసుకుందాం. బాకీలు తీర్చుకుందాం. పిల్లను మంచిగ సదివిపిచ్చుకుందాం. మస్కట్ పైసమనకు బాకీ లేదు. గా ఆలోచనలు నువ్వు మనుసుల పెట్టుకోకు. నువ్వు ఆగంగాకు. నన్ను ఆగం చెయ్యకు."

ఆమెకు ఎలా సర్ది చెప్పాలో అర్థం కాలేదు అంజయ్యకు. అయిష్టంగానే నాగలి కట్టాడు. కౌలుకుపట్టుకున్న చేను సాలు ఇరువాలు దున్ని ముడిగొర్రురొప్పాడు. మళ్ళీ మస్కట్‌మాట ఎత్తకపోవడంతో తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది బాలవ్వ. ఇద్దరు కైకిలోల్లను పిలిచి నారుపీకించింది. అప్పటికే వారం గడిచింది. చేనునాటును గుత్తకు ఇచ్చారు. తెల్లవారితే నాటు ఉందనగా రాత్రి ఇంటికి వచ్చి అంజయ్యను లేపాడు ఏజెంట్ శీను.

అతడి మాటవినగానే అంజయ్య మనసు ఆనందంతో పులకరించి పోయింది. అంతరాత్రి వేళ శీను వచ్చాడంటే ఖచ్చితంగా విజా తెచ్చి ఉంటాడని ఊహించాడు. వెళ్ళి తలుపు తెరిచాడు.

శీను, అంజయ్య చేతిలో ఒక జిరాక్స్ కాగితాన్ని పెట్టి చెప్పాడు. "ఎల్లుండి నాలుగ్గంటల బస్‌కు మన ఊరి నుండి బయల్దేరాలి. అవుతలెల్లుండి మెడికల్ టెస్టు బాంబేలో ఉంటది. మెడికల్ అయిన తెల్లారే ప్లేను ఎక్కుడు. నేనుమీకు ఎన్నటినుండో పైసలు చేసుకోండ్రి అని చెబుతున్న. ఎల్లుండి తయారు గాకపోతే విజా క్యాన్సిల్ అయితది." అంటూ తనకు తెలిసింది తెలియనిది అరగంట సేపు ఏకదాటిగా చెప్పాడు.

బాలవ్వ అయోమయంలో పడిపోయింది. గొంతు పెకల్చుకుని శీను అడిగింది. "అరువై వేయిల రూపాయలు ఒక్కరోజులో ఎక్కడ పుడుతయి. మూడునాలుగు రోజులాగినంక తోలుక పోరాదోయ్. ఇది అవద్దమో నిజమో తెల్వదుగని ఆగమాగం జెయ్యవడితివి."

"నేనేం ఆగం జేసిన వదినె. పదిరోజుల కిందనే అన్నతోని చెప్పిన. రాకముందురాలేదని బదునాం జేస్తిరి. అచ్చినంక గిట్లనవడితిరి. పదిరోజుల కిందనే అన్నతోని చెప్పిన. చాన్సు ఉన్నంక నేను వారం రోజులు ఆగుదుంటిని. చాన్స్‌లేదు. ఎట్లనన్న తిప్పలు పడుండ్రి" అన్నాడు శీను.

"మరి ఏదేశం?....పగారెంత?...ఏం పని? గివ్వేవీ చెప్పక పోతివి."

"మస్కట్ తోలిత్తున్న. మంచికంపిని. తిండిపెట్టి ఇక్కడి ఆరువేల రూపాయలిత్తరు. రోజు రెండు మూడు గంటల ఓ.టి. దొరుకుతుంది. మొత్తం మీద నెలకు ఎనిమిది వేయిలు ఎటూ పోవు. పనిగూడ అలుగకనే ఉంటది. ఆరుగంటలడ్యూటీ."

అంతవరకూ మౌనంగా వింటున్న అంజయ్య అడిగాడు.

"పని ఏంటిదిరా తమ్మీ...?" ఆప్రశ్నను ఇదివరకు ఎన్నోసార్లు అడిగాడు. శీను చెప్పాడు. ఏదో ఒకటి మాట్లాడాలనే ఉద్దేశంతో ఇప్పుడు అడుగుతున్నాడు.

"పని గురించి రందేలేదు. క్లీనింగ్ సెక్షన్. పెద్దహోటల్ ఉంటది. అందులో టేబుల్ల తుడువాలి. ఎంగిలిప్లేట్లను తీసుకెళ్ళి మిషిన్ల వెయ్యాలి. మిషిన్ కడుగుతది. అది ఏ.సి. హోటల్ చల్లగుంటది. తిండి కూడా దాంట్లనే తినాలె" తన సహజ ధోరణిలో వర్ణించి చెప్పాడు శీను.

అంజయ్య భార్యవైపు గర్వంగా చూసాడు. ఆ చూపుల్లో దిగులుకూడా ఉంది. ముందే నేను చెబితే విన్నావా అన్న భావన కూడా ఉంది. అన్నింటికి మించి ఇప్పుడు ఎలా...? అన్న ఆందోళన ఉన్నది.

బాలవ్వకు ఆనందంగానే ఉన్నా అంతకుమించి ఆందోళనగా ఉంది. రెండెకరాల చేను కౌలుకు పట్టుకుంది. అది తెల్లవారితే నాటువేయాలి. ఒక్కరోజులోనే అరవైవేల రూపాయలు అప్పు తేవాలి. ఎలా? ఆ రాత్రి ఇద్దరికీ నిద్రపట్టలేదు. ఎవరెవరిని బాకీ అడగాలో చర్చించుకున్నారు. కౌలుకు పట్టుకున్న చేనును వారిది వారికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. తమకున్న ఎకరం పొలంను కౌలుకు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు.

అంజయ్యకు విజా వచ్చిన సంగతి అతడు నిద్రలేచేసరికే ఊరంతా పాకిపోయింది. కావాలనే అలా పబ్లిసిటీ ఇచ్చుకున్నాడు శీను. గవర్నమెంట్ కంపనీ అని, పని ఎక్కువగా ఉండదని, ఓవర్‌టైం దొరుకుతుందని జీతం పదివేలు ఉంటుందని ఊరంతా తెలిసిపోయింది.

అంజయ్య అంటే గిట్టని వాళ్ళు అప్పుడే ఈర్ష్యపడుతున్నారు. ఏజెంట్ స్వభావం తెలిసిన మరికొందరు పీడుపోయి కారటువేస్తే గప్పుడు నిజమనుకోవాలె అంటున్నారు. ఇద్దరు ముగ్గురు యువకులు తెల్లవారక ముందే పాస్ పోర్ట్‌లతో శీను ఇంటిముందు ప్రత్యక్షమయ్యారు. తమను కూడా మస్కట్ పంపమని ఎన్ని పైసలు ఖర్చయినా ఫరవాలేదని బ్రతిమాలారు.

శీను ఊరిలో ప్రచారం చేసింది అందుకే. మొదట కాస్త బెట్టుచేసి పదివేల రూపాలిస్తేనే పాస్‌పోర్ట్ తీసుకుంటా నన్నాడు శీను. కాళ్ళావేళ్ళా పడి ఐదువేల రూపాయలు రెండు రోజుల్లో ఇచ్చే షరతుమీద ఒప్పుకుని పాస్‌పోర్ట్‌లు తీసుకున్నాడు శీను.

అప్పుకొరకు ఊరిలో తిరగడం మొదలెట్టాడు అంజయ్య. మస్కట్ మిత్తి (నూటికి నెలకు ఐదు రూపాయలు చొప్పున) ఇస్తానన్నా ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటికిప్పుడు ఎక్కడనుండి తెచ్చేది అంటున్నారు. ఊరిలోనే బేరం వస్తే ఎడ్లను, బత్తెను అమ్మేసాడు. అతడి

అవసరం తెలుసుకాబట్టి తక్కువ ధరకే బేరమాడారు బేరగాళ్ళు. డబ్బు అవసరం కాబట్టి ఒప్పుకున్నాడు అంజయ్య. పదివేలు చేతికి వచ్చాయి. ఇంకా యాభైవేలు కావాలి.

ఊరంతా కలియదిరిగి ఇంటికి చేరుకున్నాడు అంజయ్య. బాలవ్వ కూడా తనకు తెలిసినవాళ్ళను అడిగి చూసింది. నయాపైస అప్పుపుట్టలేదు.

"ఇది కొత్త పాత సందు. కోతల మీదైతే ఏమన్నపుడుతుండే. ఇక అటు ఇటు తిరిగి లాభం లేదు. సక్కగ నువ్వు మీ అవ్వగారింటికి పోయి విషయమంతా చెప్పు. మీ అన్ననో తమ్మున్నో అడుగు. చెరిన్ని చెయ్యిమని చెప్పు. వట్టిగగాదు. మస్కట్ మిత్తి అని చెప్పు." భార్యతో అన్నాడు అంజయ్య. బాలవ్వ అదివరకే వెళ్ళాలని నిర్ణయించుకుంది. వెంటనే బయల్దేరింది - ఎంత ఉత్సాహంతో, ధైర్యంతో వెళ్ళిందో అంతకంటే రెట్టింపు నిరుత్సాహంతో ఇంటికి చేరుకుంది.

భయంతో జ్వరం అందుకుంది. కొన్నికాకపోయినా కొన్నయినా తెస్తుందన్న ధీమాతో ఉన్న అంజయ్య భార్య మొహం చూసి నీరుగారిపోయాడు.

"ఏమైందీ...ఏమన్నరు...? కొన్నయినా చెయ్యలేదా...?" బాధగా అడిగాడు. తనలోని భయాన్ని కప్పిపుచ్చుకుని పైకి మాత్రం ధీమాగా "వాడు ఇస్తే ఎంత....ఇయ్యకపోతే ఎంత. నాకు ఊరు లేదా...? ఏ అయ్యనో ఆదుకుంటడు. నల్లమొఖం ముండకొడుకులు. ఎప్పుడు ఆదుకున్నరని ఇప్పుడు ఆదుకుంటరు." అన్నది బాలవ్వ.

తను అధైర్యపడకూడదని భార్య అలా అంటున్నదని గ్రహించాడు అంజయ్య. రాకరాకవచ్చిన అవకాశం చేజారిపోతుండడంతో అతడి హృదయం చెరువయింది. ఆరోజు ఎవరూ భోజనం చేయలేదు. మరోసారి ఆశ చావక ఊరంతా కలియదిరిగాడు అంజయ్య. చేను అమ్మిదామని చూసాడు. అప్పటికప్పుడు డబ్బు ఇచ్చే వారెవరూ ముందుకు రాలేదు.

అంజయ్య కోపంగా ఇంటికి వచ్చాడు. "నీయవ్వా....నేను ఎన్నటినుండో మొత్తుకుంటున్న. నువ్వు ఇన్నవా...? ఇప్పుడు జూడు. ఎంతపరేషాన్ అయితాందో....ఇదంతా నువ్వు చేసిందే. నువ్వు వద్దనక పోతే నేను ఈపాటికి పైసలు రెడీ చేసేవాడిని. లేకిడి మొఖందానా" అంటూ భార్య మీద విరుచుకుపడ్డాడు.

అది నిజమే అనుకుని బాలవ్వ మౌనంగా ఉండిపోయింది. బంగారం ఏమైనా ఉన్నా అమ్మిదామనుకుంది కాని సొమ్ములన్ని కలిపినా తులం కూడా కాదని తెలిసి ఆ ప్రయత్నాన్ని విరమించుకుంది. డబ్బు పుట్టదని నిర్ణయించుకుని ఆశ వదలుకున్న తరుణంలో నరహరి సేటు నుండి పిలుపువచ్చింది. ఆశగా ఇద్దరు వెళ్ళారు.

"అరే అంజయ్యా. విజా రాలేదని అందరూ బాధపడుతుంటే విజా వచ్చిన నువ్వు సాలిచ్చుకుంటివి. శీను ముందే చెప్పిండటగదరా. మరి మొదాలే సుదురాయించుకోవద్దా...?" అడిగాడు నరహరి.

"ఏం జెయ్యాలెనయ్యా....వాడు మా చెప్పిండు. ఇంతవరకు ఎన్నోసార్లు గిట్లనే చెప్పిండు. ఇది గూడా గట్లనే అనుకున్న. పొద్దటినుండి గత్తర గావరైనట్టు తిరుగుతున్న ఒక్కపైస అప్పు పుట్టకపాయె." బాధగా చెప్పాడు అంజయ్య. బాలవ్వకు సేటు ఇస్తాడన్న ధీమా కలిగింది. అందుకే ధైర్యంగా ఉంది.



కథా నిలయం
5513
శ్రీకాకుళం

నరహరి కొద్దిసేపు అదీ ఇదీ మాట్లాడి అసలు విషయానికి వచ్చాడు.

"ఇగో అంజయ్యా. మీరు ఇజ్జద్దారు మనుషులు. ఇంతవరకు ఎన్నోసార్లు అప్పు తీసుకు పోయింద్రు. నోట్లెమాట బయటపడకుండ కట్టింద్రు. ఏదో ఇంత దారి దొరికింది. ఇప్పుడన్న నాలుగు పైసలు ఎనుకేసుకుంటరంటే అప్పుపుట్టకపాయె. నా దగ్గరున్నా ఇత్తుంటి. మీకు ఒక్కటే మార్గం చెప్పుతా. నాబిడ్డది పుస్తెలతాడు, చంద్రహారం, ఉంగురాలు, గొలుసు కలిపితే పన్నెండు తులాలు అయితది. అవ్వి నీకు ఇస్తా. యాడాది వరకు తులానికి తులంనర చొప్పున పద్దెంది తులాల బంగారం కొని వస్తువులు చేయించు. తులానికి (పది గ్రాములకు) తులంనర మస్కటోల్లకు నడుస్తున్నదే. కొత్తదేమీ కాదు. యాడాది దాటితే మాత్రం అదనంగా మిత్తి పడుతది. మీ ఇష్టం."

అంజయ్య సేటు వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసాడు. తులానికి తులంనర బంగారం ఇంతవరకు ఎంతోమంది తీసుకుపోయారు. బాలవ్వ కూడా అభ్యంతరం చెప్పలేదు. డబ్బు సరిపోదని మరో రెండు తులాలు ఎక్కువ కావాలని బ్రతిమాలింది. పద్నాలుగు తులాల బంగారం తీసుకుని ఇరవై ఒక్క తులాల బంగారం సంవత్సరం వరకు ఇచ్చే షరతు మీద కాగితం వ్రాయించుకున్నాడు సేటు.

బంగారు నగలను చితక్కొట్టి కడ్డీబంగారంగా మార్చేసరికి తులంతరిగిపోయింది. యాభై రెండు వేయిలు మాత్రమే చేతులకొచ్చాయి. అనుకున్న టైంకు బయల్దేరాడు అంజయ్య. అన్నీ సవ్యంగానే జరిగాయి. అంజయ్యను ఫ్లైట్ ఎక్కించి వారంరోజుల్లో తిరిగి వచ్చాడు శీను. అప్పటికే మరో పదిమంది పాస్‌పోర్టులతో, పది వేల రూపాయలతో రెడీగా ఉన్నారు.

పదిహేను రోజుల్లో అంజయ్య లెటర్ వేసాడు. పని అలుకగనే ఉందని తిండి కంపినే పెడుతుందని వ్రాసాడు. జీతం మాత్రం మూడు వెయిలే ఉంటుందని వ్రాసాడు. అనుకున్నట్టుగా భర్త క్షేమంగా చేరుకున్నందుకు బాలవ్వ తృప్తిగా ఊపిరి పీల్చుకుంది. తర్వాత ఆలోచించింది. రెండు సంవత్సరాల జీతం జమ చేసినా సేటు బాకీ మాత్రం తీరదని లెక్కకట్టాక ఆమె గుండె దడదడలాడింది.

మూడు నెలల తర్వాత బేంక్‌నెంబర్ తీసి పంపుమని ఉత్తరం వ్రాసాడు అంజయ్య. ఆరు నెలల తర్వాత పదిహేనువేల చెక్కు పంపించాడు. ఆ కొద్దిపాటి డబ్బును ఏం చేయాలో తోచలేదు. చెక్కు వచ్చిన విషయం తెలుసుకుని బాలవ్వను పిలిపించాడు నరహరి. ఒక్కసారి డబ్బు ఇవ్వడం సాధ్యం కాదని వచ్చిన డబ్బు తన వద్ద దాచిపెట్టుమని, ఎప్పటికప్పుడు లెక్క రాస్తనని చెప్పాడు. ఐదువేలు చిల్లరబాకీలు కట్టి పదివేలు నరహరికి ఇచ్చింది బాలవ్వ. ఎప్పటికప్పుడు వచ్చిన చెక్కును డ్రా చేసి సేటుకు ఇస్తుంది. అతడు లెక్కరాస్తున్నాడు. ఆ డబ్బును వడ్డీకి ఇచ్చుకొంటున్నాడు.

ఏడాది గడిచింది. ఓవర్‌టైం చేస్తున్నానని అప్పుడప్పుడు కొంత ఎక్కువ డబ్బు పంపడంతో నలభై రెండు వెయిలు జమయ్యాయి. బంగారం ఇచ్చేవాయిదా వచ్చింది. లెక్క చూసి బాలవ్వను మిగతా డబ్బు తెమ్మన్నాడు నరహరి. మరో ఆరు నెలలు ఆగమంది బాలవ్వ. బంగారం రేటు పెరిగిందని, నగలు చేయించడానికయ్యే ఖర్చుతో సహా లెక్కగట్టి లక్షపైనే అవుతాయని చెప్పాడు. ఆరు నెలలకు కాదుగదా ఇంకో ఏడాదికైనా తీరదని అందుకే మళ్ళీ వడ్డీ రాసుకొమ్మని చెప్పాడు. తన డబ్బుకు కూడా వడ్డీ అడిగింది బాలవ్వ. మొహం మాడ్చుకున్నాడు నరహరి. నలభైవేయిలకు

ఆరోజునుండే వడ్డీ ఇస్తానని, తనకు లక్షరూపాయలపైనే అవుతాయని వాటిక్కూడా వడ్డీ ఇవ్వుమని ఒత్తిడి చేసాడు. ఒప్పుకోక తప్పింది కాదు బాలవ్వకు.

మూడేండ్లు గడిచాయి. నరహరి బాకీ తీరిపోయింది. అంజయ్య తిరిగివచ్చాడు. బంధువులకు బాకీ ఇచ్చినవారికి చిన్న చిన్న కానుకలు తెచ్చాడు. వారం రోజులు వచ్చిపోయేవారితో ఇల్లంత సందడిగా గడిచింది. ఎవరేమనుకుంటారోనని వచ్చినవారందరికి మంచి మర్యాదలు చేసింది బాలవ్వ. అంజయ్య ఖాళీ చేతులతో రావడంతో అప్పుతెచ్చి మరీ మర్యాదలు చేసింది. వారంతా అంజయ్య డబ్బు బాగానే సంపాదించుకుని వచ్చాడనుకున్నారు.

వారం రోజుల తర్వాత వచ్చిపోయేవారి రద్దీ తగ్గిపోయింది. బాలవ్వ భర్తపంపిన డబ్బులు తను కట్టిన అప్పు లెక్క చూపించింది. మూడేళ్ళ సంపాదనతో అప్పు మాత్రమే తీరింది. ఈ వారం రోజుల ఖర్చు అప్పుగా మిగిలింది. భర్తవైపు బేలగా చూస్తూ అడిగింది బాలవ్వ.

"అక్కడ నువ్వు రెక్కలు ముక్కలు జేసుకున్నవు. ఇక్కడ నేను పిల్లలు కడుపుకట్టుకున్నము. అయినా ఒక్కపైస మిగల్లేదు. ఈ మూడేండ్లల్ల ఏం సంపాయించినము? బాకీ మాత్రమే తీర్చినము. నడుమల సేటును, శీనును బతికిచ్చినము. ఒగలమొఖం ఒగలం చూసుకోకుండా అంతదూరం పోతివి. బాకిలమన్నువడ ఎంతదూరం పోయినా ఎప్పటిచిప్పఏనుగులనే. ఇక్కడ ఉండి ఎవుసం జేసుకున్నాగాని నాలుగు పైసలు సంపాయించుకుందుము."

భార్యవైపు నవ్వుతూ చూసాడు అంజయ్య. అతడి చూపుల్లో ధీమా ఉంది. మాటల్లో ఆత్మ విశ్వాసం ఉంది. "పిచ్చిదానా....గట్లనుకుంటారే...ధైర్నంగుండాలె. నాకు మళ్ళారిటర్న్ విజా ఉంది. రెండు నెలలయినంక మళ్ళాపోత. ఓవర్‌టైం ఎక్కువ జేస్తే ఈసారి బాకీలు లేవుగాబట్టి పంపినయి పంపినట్టు నిల్వనే ఉంటయి. జీవితంల బాగు పడాలంటే ముందుగల్ల కష్టపడాలె. గప్పుడె సుఖం."

బాలవ్వకు కూడా ఎక్కడలేని ధైర్యం వచ్చింది. భర్తవైపు తృప్తిగా చూసింది. చీకటి విడిపోయి తెల్లవారుతుందనడానికి గుర్తుగా తొలికోడికూసింది.

*(ప్రజాసాహితి మాసపత్రిక - ఆగస్టు 2000)*